వరదల నివారణకే నాలాల నిర్మాణం

నిజాంపేట్: లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తకుండా ఉండేందుకు నాలాలు నిర్మిస్తున్నట్లు మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. పలువురు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ వ్యవస్థ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు దాదాపు రూ. 90 కోట్ల వ్యయంతో పనులు చేపట్టామని, నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయన్నారు. డ్రైనేజీలు, రోడ్ల ప్యాచ్‌వర్క్‌తో పాటు వరద నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, సురేశ్ రెడ్డి, కో


నాలా పనులను పరిశీలిస్తున్న మేయర్ నీలారెడ్డి

ఆప్షన్ సభ్యులు తలారి వీరేశ్‌ముదిరాజ్, నాయకులు వెంగయ్య చౌదరి, తలారి సాయి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



కుత్బుల్లాపూర్: కొంపల్లి ఉమామహేశ్వర కాలనీలోని పోచమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత దంపతులు కల్యాణాన్ని జరిపించారు. ఆదివారం బోనాల పండుగను పురస్కరించుకుని కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉమామహేశ్వర కాలనీతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

భారత క్రీడాకారులకు 'మనూ' శుభాకాంక్షలు

రాయదుర్గం: పారిస్ ఒలంపిక్స్–24లో భారత్ భారీగా పతకాలను సాధించాలని మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ ఆకాంక్షించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం వద్ద భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీఎస్‌సీ చైర్మన్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏ కలీముల్లా, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ జే రాజేష్, డాక్టర్ మహ్మద్ హబీబుల్లా, అసిస్టెంట్ ఇంజనీర్ ఎంఏ హఫీజ్ పాల్గొన్నారు.

ఎస్‌టీపీ ప్రారంభానికి వేళాయె..!

- వెన్నెలగడ్డలో రూ. 21 కోట్లతో మురుగు నీటి శుద్ధి కేంద్రం
- పూర్తయిన పనులు
- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మరూ
- ఏర్పాట్లు చేస్తున్న జలమండలి

చింతల్: హైదరాబాద్ నగర శివారు, మున్సిపల్ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్‌టీపీ) జలమండలి నిర్మిస్తున్నది. ఇందులో భాగంగా 2022 జనవరిలో అప్పటి మంత్రి కేటీఆర్ కుత్బుల్లాపూర్‌లో సివరేజ్ ట్రీట్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌లో మూడో ప్యాకేజీ కింద 5 సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా వెన్నెలగడ్డ, శివాలయనగర్‌లో ప్లాంట్ల నిర్మాణం చేపట్టగా శివాలయనగర్‌లో సగం పనులే పూర్తి కాగా, వెన్నెలగడ్డలో నిర్మిస్తున్న 10 ఎంఎల్‌డీ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యింది. దీంతో మరికొన్ని రోజుల్లోనే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

వెన్నెలగడ్డలో రూ. 21 కోట్లతో నిర్మాణం..


వెన్నెలగడ్డలో ప్రారంభానికి సిద్ధమైన సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

కొత్త ఎస్టీపీల ప్రాజెక్టు ప్యాకేజీ పనుల్లో భాగంగా కుత్బుల్లాపూర్‌లోని ఫాక్స్‌సాగర్, వెన్నెలగడ్డ, గాయత్రీనగర్, పరికిచెరువు, శివాలయనగర్ ప్రాంతాల్లో 66 ఎంఎల్డీల సామర్థ్యంతో సుమారు రూ. 258 కోట్లతో ఐదు ఎస్టీపీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందులో రూ. 21.87 కోట్లతో 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో చేపట్టిన వెన్నెలగడ్డ ప్లాంటు నిర్మాణం పూర్తయ్యింది. దీని ద్వారా వెన్నెలగడ్డ చెరువులో కలిసే మురుగునీటిని నేరుగా ఈ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు అనుసంధానం చేసి ఇక్కడ శుద్ధి అయిన తర్వాత నీటిని నేరుగా ప్రధాన నాలాల ద్వారా హుస్సేన్ సాగర్‌లో కలిపేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.


ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

ఆధునిక టెక్నాలజీతో నిర్మాణం..

నగరంతో పాటు కుత్బుల్లాపూర్‌లో చేపడుతున్న మురుగునీటి శుద్ధి కేంద్రాలను అధునాతన టెక్నాలజీతో నిర్మిస్తున్నట్లు జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. నూతన ఎస్‌బీఆర్ (సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీ) తో పనులు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో స్థలాభావం తక్కువగా ఉండడం వల్ల ఈ టెక్నాలజీతో ఒకే చాంబర్‌లో సుమారు ఐదు స్టేజీల వరకు మురుగు నీటి శుద్ధి ప్రక్రియ జరిగి తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నీటిని శుద్ధి చేయవచ్చని చెబుతున్నారు. దేశంలో వినియోగిస్తున్న వివిధ బయోలాజికల్ ట్రీట్‌మెంట్ పద్ధతుల కంటే ఈ ఎస్‌బీఆర్ టెక్నాలజీతో తక్కువ ఖర్చు అవుతుందని దీనికి తోడుగా చాలా మెరుగ్గా మురుగునీటి శుద్ధి ప్రక్రియ జరుగుతుందని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు.

శివశివానీ కాలేజీలో కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివానీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమరులైన సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి గౌరవ వందనం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో సైనికులు కాపలా ఉంటూ మనల్ని కాపాడుతున్నారని, వారి సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ అమర వీరుల కుటుంబాల దుఃఖాన్ని వర్ణిస్తూ విద్యార్థులు చేసిన స్కిట్ కంటతడి పెట్టించాయి. కో.ఆర్డినేటర్లుగా ఫ్యాకల్టీ మాధవీలత, గౌతమి వ్యవహరించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీ

దుండిగల్: ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలపై దుండిగల్ మున్సిపల్ రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. దుండిగల్ తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది భౌరంపేట్ సర్వే నంబర్ 472లో పలు బేస్‌మెంట్లు, గదులను జేసీబీతో శుక్రవారం కూల్చి వేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేసి మోసపోవద్దని, ఎవరైనా అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంట్రాక్ట్ ట్రాఫిక్ సిబ్బందికి సత్కారం


శివకుమార్‌ను సత్కరిస్తున్న రవీందర్

సుభాష్‌నగర్: నిబద్ధతతో విధులు నిర్వర్తించిన కాంట్రాక్ట్ ట్రాఫిక్ సిబ్బందిని డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సత్కరించారు. శివకుమార్ ఏడాదిగా సూరారం చౌరస్తాలో ట్రాఫిక్ కాంట్రాక్ట్ సిబ్బందిగా పని చేస్తున్నాడు. ఇటీవల అతని కాంట్రాక్ట్ పూర్తి కావడంతో శుక్రవారం సామాజిక కార్యకర్త, డాక్యుమెంట్స్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోలా రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.

శాకంబరీ దేవిగా అమ్మవారు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు శుక్రవారం శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో పాటు 129,128 డివిజన్ల కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, మొహమ్మద్ రఫీక్, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, సురేశ్ రెడ్డి, బీఆర్ఎస్ యూత్ నాయకులు సతీశ్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


శాకాంబరీ దేవిగా అమ్మవారు


కార్పొరేటర్లను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సిబ్బంది

ఓరియంటేషన్ డే


మాట్లాడుతున్న పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి, హైమవతి హాజరై క్రీడో పబ్లిషింగ్ పుస్తకాలు ఆంగ్లం, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, లాజికల్ రీజనింగ్ పాఠ్యాంశాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర అంశాలపై పట్టు సాధించేలా తమ పాఠశాలలో బోధన ఉంటుందని కోటిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో విజయకుమారి, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్: నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో బహదూర్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్–19 విభాగంలో విద్యార్థులు నందు గోల్డ్ మెడల్, సౌమ్య, సునీల్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. దీంతో శుక్రవారం పాఠశాలలో డీఈవో విజయకుమారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు


డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు

నిజాంపేట్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన యంగ్‌స్టార్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం డిప్యూటీ మేయర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాలతో పాటు తొట్టెల ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

నియామకం


కేశవ్ యాదవ్

జీడిమెట్ల: మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా న్యాయవాది కేశవ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. తనలాంటి సాధారణ కార్యకర్తని జిల్లా కార్యదర్శిగా నియమించడం ఆనందంగా ఉందని ఈ స్థాయికి చేరుకునేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలని కేశవ్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి చెంది శ్రీనివాస్, పత్తి రఘుపతి, డివిజన్ అధ్యక్షుడు పులి బలరాం, పత్తి సతీశ్, సాయినాథ్ నేత, పరుష వేణు, దుర్యోధన రావు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయంలో సమావేశం

కుత్బుల్లాపూర్: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో కమిషనర్ అపూర్వచౌహాన్ గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు, ఏఎంసీ, రెవెన్యూ, బిల్ కలెక్టర్లతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బిల్ కలెక్టర్లు ప్రతిరోజు ఐదు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలని, జీరో డిమాండ్ ప్రాపర్టీలపై దృష్టిసారించి పన్ను విధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా అసెస్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న నిర్మాణాలు, అసెస్‌మెంట్ పూర్తికానీ వాటిపై దృష్టి పెట్టి టార్గెట్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఉప కమిషనర్ ప్రతిరోజు ఇంటి పన్ను వసూళ్లపై సిబ్బందితో సమావేశం నిర్వహించి పురోగతిపై చర్చించాలన్నారు. తక్కువ ట్యాక్స్‌లు వసూలు చేసే సిబ్బంది వివరాలను ఎప్పటికప్పుడు జోనల్ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని, ఏఎంసీలు, బిల్ కలెక్టర్లు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు ఆయా సంబంధిత ఏరియాల్లో పన్నుల వసూళ్లపై దృషి సారించాలని ఆదేశాలు జారీ చేశారు.

ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలి


జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కుమార్ తదితరులు

కుత్బుల్లాపూర్: ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లోని ట్రైబల్ డిక్లరేషన్ వెంటనే అమలయ్యేలా చూడాలని కోరుతూ మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కట్ట కుమార్, రూరల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌నాయక్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి చేవేళ్ల బహిరంగ సభ వేదికగా ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించారని, వెంటనే ఆ హామీనీ నెరవేర్చాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ, వెంకటేశ్ నాయక్, మాలోత్ వెంకటేశ్‌నాయక్, వసంత్ కుమార్, మండలాధ్యక్షుడు గోపీ నాయక్, రాజునాయక్, మండల ప్రధాన కార్యదర్శి చందర్‌నాయక్, రామునాయక్, హరిచంద్ర నాయక్, మహిళా నాయకురాలు సునీత నాయక్, స్వప్న నాయక్ తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నిజాంపేట్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీకి చెందిన వెంకట్రావు భార్య శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంటికి తాళం వేసి సూపర్ మార్కెట్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన వెంకట్రావు భార్యకు ఫోన్‌చేయగా సూపర్ మార్కెట్‌లో ఉన్నానని చెప్పడంతో ఆమెవద్దకు వెళ్లి తాళం తీసుకున్నాడు. ఇంటికి వెళ్లి బీరువా తెరిచి చూడగా అందులోని 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష 20 వేలు కనిపించలేదు. దీంతో ఈ విషయమై భార్యను అడుగగా తాను తీయలేదని సమాధానం చెప్పింది. దీంతో వెంకట్రావు సుమారు 20 తులాల బంగారం మాయమైందని బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇది తెలిసిన వారి పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

పెద్దమ్మ ఆలయ పనుల పరిశీలన

జగద్గిరిగుట్ట: భూదేవి హిల్స్ కాలనీలోని పెద్దమ్మ ఆలయ పనులను స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ శుక్రవారం పరిశీలించారు. ఆదివారం నిర్వహించనున్న బోనాల వేడుకలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌తో మంత్రి సత్యనారాయణ, సురేశ్ రెడ్డి, భూదేవి హిల్స్ వ్యవస్థాకులు బాలకృష్ణ, విఠల్ ముదిరాజ్ దాసు, హనుమా రెడ్డి భూదేవి హిల్స్ కాలనీ వాసులు పాల్గొన్నారు

బోనాలకు ఆలయాల ముస్తాబు


గాజులరామారం చిత్తారమ్మదేవి ఆలయం

సుభాష్‌నగర్: బోనాల వేడుకలకు కుత్బుల్లాపూర్‌లోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. రెండురోజులుగా నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు వేయడంతో పాటు లైట్లు ఇరువైపులా మైక్ సెట్లను ఏర్పాటు చేశారు. కాగా శనివారం నుంచే బోనాల కార్యక్రమాలు షురూ కానున్నాయి.

పనుల్లో నిమగ్నం..

స్థానిక ఆలయాల వద్ద కమిటీ ఆధ్వర్యంలో లైటింగ్, మైక్, స్వాగత తోరణాలు ఇతర పనులు చేపడుతున్నారు. గాజుల రామారం చిత్తారమ్మ దేవి, సూరారం కట్టమైసమ్మ ఆలయాల వద్ద దుకాణాలు రంగులరట్నాలు ఏర్పాటు చేస్తున్నారు.

106 ఆలయాలకు నిధులు..

కుత్బుల్లాపూర్‌లో బోనాల పండుగ సందర్భంగా 106 అమ్మవార్ల ఆలయాలకు రూ. 2,98,4000 నిధులు మంజూరు చేసినట్లు దేవాదాయ ఈవో చారి తెలిపారు.


ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న స్థానికులు


మైకులు ఏర్పాటు చేస్తూ..



ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

రేపు పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయ 26వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సంతోష్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం నల్లపోచమ్మ ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ యేటా జరిగే వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి అభిషేకాలతో పాటు బోనాల సమర్పణ ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలరాజు, సభ్యులు పరుష వేణు, ప్రవీణ్ కుమార్, సుధాకర్ రెడ్డి భీమనపల్లి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ముగిసిన పూజలు

జగద్గిరిగుట్ట: మైసమ్మ నగర్‌లో బొడ్రాయి గ్రామ దేవత పునఃప్రతిష్ఠ పూజలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు స్థానిక కార్పొరేటర్ జగన్‌తో పాటు సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పూజల్లో కమిటీ సభ్యులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మోతీనగర్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అల్లాపూర్ సీఐ వివరాల ప్రకారం.. అల్లాపూర్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుంది. రెడ్ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడు. మద్యం సేవించి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సేవలను వినియోగించుకోవాలి

బాలానగర్: కేంద్ర తపాలా సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన డీసీడీపీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తపాలా సంస్థ అందిస్తున్న జీవిత బీమా, ప్రమాద బీమా తదితర సేవలను వివరించారు. కార్యక్రమంలో పోస్టల్ అధికారులు శ్రీనివాసరావు, గోవిందరాజ్, డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి పాల్గొన్నారు.